
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 1 । జూన్ । 2025



సోమశిలలో 42.486 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారానికి 42.486 టీఎంసీలు ఉన్నాయి. 652 క్యూసెక్కులు వస్తుండగా, డెల్టాకు 3,180, ఉత్తర, దక్షిణ కాలువలకు 300 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.98,350
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.8,920
3 శాతం జీఎస్టీతో	రూ.9,188
నవర (8 గ్రా)	రూ.73,504

గరిష్టం/కనిష్టం
35.4 /26.9

వాతావరణం

జిల్లాలో ఆదివారం మధ్యాహ్నం వరకు అక్కడక్కడ ఆకాశం పాక్షికంగా మేఘావృతంగా, ఆ తర్వాత పొడిగా ఉంటుంది. శనివారం గాలిలో తేమ 58 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి రేషన్ షాపుల్లో సరుకుల పంపిణీ

నెల్లూరు (పొగతోట): ఆదివారం నుంచి జిల్లా వ్యాప్తంగా రేషన్ షాపుల ద్వారా సరుకుల పంపిణీ జరుగుతుంది. ఇంటి వద్దే పంపిణీకి స్వస్తి పలుకుతూ ఎండీయూ వాహనాలను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. జిల్లాలో 1,513 చౌకదుకాణాల ద్వారా 6,25,019 మంది కార్డుదారులు క్యూలైన్లో నిలబడి రేషన్ తీసుకోవాల్సి ఉంటుంది. దివ్యాంగులు, వృద్ధులకు మాత్రం ఇంటి వద్ద పంపిణీకి చర్యలు చేపట్టారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దనే రేషన్ పంపిణీ చేయడంతో ప్రతి కార్డుదారు సరుకులు తీసుకున్నారు. ఇక నుంచి ప్రతి నెల 1వ తేదీ నుంచి 15 వరకు ప్రతి చౌకదుకాణం వద్ద సరుకులు పంపిణీ చేయనున్నారు.

రిజిస్ట్రేషన్‌శాఖ డీఐజీగాముని శంకరయ్య బాధ్యతల స్వీకరణ



నెల్లూరు సిటీ: నెల్లూరు రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీగా ఎం.మునిశంకరయ్య శనివారం బాధ్యతలు నగరంలోని వేదాయపాళెంలో ఉన్న కార్యాలయంలో స్వీకరించారు. ఇన్‌చార్జి డీఐజీ వీ పుష్పలత, జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు ముని శంకరయ్యకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. మునిశంకరయ్య అన్నమయ్య జిల్లా రిజిస్ట్రార్‌గా పని చేస్తూ ఇటీవల పదోన్నతిపై నెల్లూరు డీఐజీగా బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ జిల్లా రిజిస్ట్రార్‌గా, ఆడిట్ రిజిస్ట్రార్‌గా 7 ఏళ్ల పాటు పని చేసిన అనుభవం ఉంది.

వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు

- పరాకాష్టకు చేరిన కక్ష సాధింపు చర్యలు

నెల్లూరు (క్రైమ్): వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలే లక్ష్యంగా కూటమి నేతలు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోన్నారు. ఇప్పటికే మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు కాకాణిపై అక్రమ కేసులు పెట్టించి జైలుకు పంపింది. ఈ నేపథ్యంలో కాకాణిపై పెట్టి అక్రమ మైనింగ్, అరెస్టులపై నిజానిజాలు ప్రజలకు తెలియాలని, పోలీసుల దర్యాప్తుపై తమకు నమ్మకం లేదని సీబీఐ దర్యాప్తు కోరుతూ శనివారం శాంతియుతంగా కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈక్రమంలో కార్యక్రమంలో పాల్గొన్న కొందరు నేతలపై అక్రమ కేసులు పెట్టించడం, కక్ష సాధింపు చర్యలు పరాకాష్టకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. కాకాణి అక్రమ అరెస్ట్‌పై సీబీఐ విచారణ జరిపించాలని కాకాణి కుమార్తె పూజిత, ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేరిగ మురళీధర్, మరికొందరు నేతలు ముందస్తు అనుమతి తీసుకుని శనివారం కలెక్టరేట్‌లో జేసీకి వినతిపత్రం అందజేసే ముందు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరసన కార్యక్రమంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతోపాటు అటుగా వెళుతున్న వారిని, కలెక్టరేట్ సిబ్బందిని అడ్డగించారని, శాంతిభద్రతలకు భంగం కలగించారంటూ వైఎస్సార్‌సీపీ నేతలు మందల వెంకటశేషయ్య, మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, రావుల ఇంద్రసేనాగౌడ్, అబ్దుల్ మస్తాన్, సిద్ధిఖ్‌బాషా, బొబ్బల శ్రీనివాస్‌యాదవ్, రావు శ్రీనివాసరావు, సత్తార్, సురేష్, బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డితోపాటు మరికొందరిపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు.

అన్నదాత దుఃఖీభవ

సేద్యానికి పెట్టుబడి సాయం మంగళం

నాడు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో వ్యవసాయం పండగలా మార్చారు. సాగుకు పెట్టుబడి సాయంగా వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని ప్రారంభించి, అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే అందించారు. ఎన్నికల మేనిఫెస్టోలో నాలుగేళ్లకే ప్రకటించిన రైతు భరోసా పథకాన్ని తొలి ఏడాదితో కలిపి ఐదేళ్లు అమలు చేశారు. కరోనా విపత్తు వేళ సైతం సాకులు చెప్పకుండా ఆదుకున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ కంటే అదనంగా పెట్టుబడి సాయాన్ని పెంచారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు నిర్మించి అక్కడే విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లను సబ్సిడీతో విస్తృతంగా అందించారు. ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేసి, ఏ సీజన్‌లో పంట నష్టం జరిగితే ఆ సీజన్ ముగిసేలోపు పరిహారంతో పాటు సకాలంలో వ్యవసాయ రుణాలు చెల్లించిన వారికి సున్నా వడ్డీ పథకాన్ని అమలు చేశారు. ఇన్‌పుట్ సబ్సిడీలు పంటకు గిట్టుబాటు ధర నుంచి.. మార్కెటింగ్ వరకు అండగా నిలిచారు. వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమకు దన్నుగా నిలిచారు.



నేడు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టేసింది. రైతుల సంక్షేమాన్ని, అభివృద్ధి పథకాలకు తిలోదకాలిచ్చేసింది. ఉచిత పంటల బీమా పథకాన్ని ఒక్క కలం పోటుతో రద్దు చేసింది. ఈ ఏడాది కాలంలో పంట నష్టపోయిన రైతులకు బీమా పరిహారం దక్కలేదు. 'వైఎస్సార్ రైతు భరోసా' పేరును 'అన్నదాత సుఖీభవ'గా మార్చి ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇస్తానని మంగళం పలికింది. గ్రామీణ ప్రాంతంలోని రైతు భరోసా కేంద్రాలను రైతుసేవా కేంద్రాలుగా మార్చినా.. విత్తనాలు, ఎరువుల కోసం పాత రోజులు తెచ్చి పెట్టింది. సకాలంలో రుణాలు చెల్లించిన రైతులకు సున్నా వడ్డీ వర్తింపు లేదు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ లేదు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించే విషయాన్ని గాలికి వదిలేసింది. సగానికి సగం ధరలు తగ్గిపోయి రైతులు విలవిల్లాడుతున్నారు. మొత్తంగా అన్నదాత.. దుఃఖభవ అంటూ ఏడాది గడిపేసింది.



- సున్నా వడ్డీ చెల్లింపులకు దిక్కులేదు
- పంటల ఉచిత బీమాకు చెల్లుచీటి
- రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఊసేలేదు

నెల్లూరు (పొగతోట): సింహపురి వ్యవసాయాధారిత జిల్లాగా పేరుగాంచింది. ముక్కారు పంటలతో ధాన్య సిరులతో విలసిల్లిన జిల్లాలో ఇప్పుడు అన్నదాతలు దుఃఖిస్తున్నారు. 'వ్యవసాయం దండగ' అని చిన్నచూపు చూసిన సీఎం చంద్రబాబు.. ఇప్పటికీ అదే పంథాను అనుసరిస్తున్నారు. చంద్రబాబు పాలనలో కరువు కాటకాలు, ధరాఘాతాలతో వ్యవసాయం సంక్షోభంలోకి వెళ్లిపోయింది. కాడిపట్టిన రైతులు.. చివరకు రాళ్లు, మట్టి మోసే కూలీలుగా మారారు. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంతి అయ్యాక వ్యవసాయాన్ని పండగ చేశారు. ఆ తర్వాత ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనూ అంతకు మించి రైతును ఆర్థిక సంక్షోభం నుంచి రారాజుగా చేశారు.

ఆదుకుంటానని.. అప్పుల ఊబిలోకి..

జిల్లాలో సుమారు 30 లక్షల ఎకరాల వరకు వ్యవసాయ భూములు ఉన్నాయి. ఇందులో ప్రధానంగా అత్యధికంగా దాదాపు 8 లక్షల నుంచి 9.5 లక్షల ఎకరాల్లో వరి సాగు అవుతుండగా, మిగతా మెట్ట పంటలు సాగవుతున్నాయి. ఇందులో సన్న, చిన్నకారు రైతులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సుమారు 2.15 లక్షల మంది రైతులకు ఏటా పీఎం కిసాన్, వైఎస్సార్ రైతు భరోసా కింద ఏటా రూ.13,500 అందజేసింది. అయితే ఎన్నికల ముందు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏటా రూ.20 వేల లెక్కన 'అన్నదాత సుఖీభవ' ఇస్తామని హామీలిచ్చింది. గతేడాది ఈ పథకానికి మంగళం పలికారు. ఈ ఏడాది జూన్‌లో ఇస్తామని చెబుతున్నా.. ఇంత వరకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియపై నీలినీడలు కమ్ముకున్నాయి. బ్యాంకుల్లో కొత్త అప్పులు మంజూరు చేయడం లేదు. ఇచ్చిన అప్పులనే రెన్యువల్ చేస్తున్నారు. రైతుల పంటల సాగుకు అప్పులు చేయాల్సిన పరిస్థితి దాపురించింది.



వైఎస్సార్ సున్నా వడ్డీ

సంవత్సరం	రైతులు	నగదు
2020-21	10,495	రూ.1.99 కోట్లు
2021-22	1,291	రూ.2.69 కోట్లు
2022-23	25,695	రూ.5.75 కోట్లు

రైతు భరోసా పథకం

సంవత్సరం	మొత్తం రైతులు	ఆర్థిక సాయం (రూ.కోట్లల్లో)
2019-20	2,02,306	రూ.273.11
2020-21	2,43,502	రూ.328.72
2021-22	2,43,911	రూ.329.27
2022-23	2,14,667	రూ.289.80
2023-24	2,14,667	రూ.289.80



వైఎస్సార్‌సీపీ పాలనలో వ్యవసాయాభివృద్ధి

- రైతు భరోసా కేంద్రాలు 656
- ఒక్కొక్క భవన నిర్మాణానికి కేటాయించిన మొత్తం రూ. 21.80 లక్షలు
- ఐదేళ్లలో వైఎస్సార్ రైతు భరోసా సాయం రూ. 1,510.70 కోట్లు
- రైతు భరోసా లబ్ధిదారుల రైతులు 9,31,943 మంది

ధాన్యం ధరలు పాతాళానికి పతనం



చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా ధాన్యం ధరలే కాదు.. ఏ పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కాదు కదా.. కనీసం ప్రకటించిన మద్దతు ధర కూడా దక్కే పరిస్థితి లేదు. చంద్రబాబు సీఎంగా దిగిపోయే 2004 సంవత్సరంలో కూడా పుట్టి ధాన్యం రూ.4 వేలు దాటిన చరిత్ర లేదు. ఆ తర్వాత వైఎస్సార్ అధికారంలోకి వచ్చిన ఐదేళ్లల్లో ధాన్యం ధరలు ఊహించని విధంగా ఏటా పెరిగాయి. వైఎస్సార్ హయాంలో పుట్టి ధాన్యం రూ.13 వేల వరకు ఎగబాకాయి. ఇక ప్రత్యేకించి జిలకర మసూరి రకం అయితే ఏకంగా రూ.17 వేల వరకు అప్పట్లోనే పలికాయి. తిరిగి చంద్రబాబు అధికారంలోకి వచ్చిన 2014–19 మధ్య కాలంలో మద్దతు ధరలు బాగా పెరిగినప్పటికీ.. పుట్టి రూ.10 వేల నుంచి రూ.11 వేలకు కొనే పరిస్థితి లేకుండా పోయింది. మార్కెట్లో డిమాండ్ ఉన్న జిలకర మసూరి రకాన్ని సైతం మిల్లర్లకు మేలు చేకూర్చేందుకు 'ఏ' గ్రేడ్ రకంగా ముద్ర వేసి ఆ రకం ధాన్యం ధరల గుట్టకూల్చారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్న ఐదేళ్లు మద్దతు ధరలు లభించేలా అనేక చర్యలు తీసుకున్నారు. గతేడాది పుట్టి మద్దత ధరకు మించి రూ.25 వేల వరకు రైతులు అమ్ముకున్నారు. తాజాగా పూర్తయిన ఖరీఫ్ సీజన్‌లో పుట్టి ధాన్యం రూ.15 వేల నుంచి రూ.17 వేల లోపే కొనుగోలు చేసిన పరిస్థితి తెలిసిందే. ఒక్క ధాన్యం ధరలే కాకుండా గతేడాదితో పోల్చితే.. పసుపు రైతు పుట్టి ముంచారు. పొగాకు ధరలు అయితే కేజీకి రూ.100 తగ్గిపోయింది. మిర్చి ధరలు అయితే నేలచూపులు చూస్తున్నాయి. మామిడి, సపోటా, నిమ్మ, బత్తాయి ధరలు కూడా ఇదే రీతిలో ఉన్నాయి. రైతులకు గిట్టుబాటు కల్పించే విషయంలో చంద్రబాబు ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. పంటలకు ధరలు లేకపోతే ఎందుకు సాగు చేయడం అని సాక్షాత్తు వ్యవసాయశాఖ మంత్రి అంటారు. మరి ప్రభుత్వం ఉండేది ఎందుకని రైతులు ప్రశ్నిస్తున్నారు.

సేద్యానికి భరోసా పోయింది



గత ప్రభుత్వంలో రైతులకు ఎంతోమేలు జరిగింది. ఆర్బీకేల ద్వారా రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందజేశారు. అప్పట్లో వ్యవసాయానికి ఒక భరోసా ఉంది. కూటమి ఆర్బీకేలను రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చి విత్తనాలు, ఎరువులు అందజేయడం లేదు.

– జీ మోహన్, రైతు, తాటిపర్తిపాళెం, వెంకటాచలం మండలం

ఆ నాటి భరోసా లేదయ్యా..!



గత ప్రభుత్వంలో మా కుటుంబానికి రూ.2 లక్షలు వరకు ఆర్థికంగా సాయం లభించింది. రూ.67,500 రైతుభరోసా, యంత్రా సేవా పథకం ద్వారా ట్రాక్టరు వ్యవసాయ పనిముట్లు 50 శాతం రాయితీ పొందాను. ఇంటి వద్దకే విత్తనాలు, పురుగు మందులు అందించారు. ఈ ప్రభుత్వంలో అన్నదాత సుఖీభవ లేదు. గిట్టుబాటు ధరలు లేవు. వ్యవసాయం పూర్తిగా ఎత్తిపోయింది.

– ఎర్రగుంటి మాలకొండయ్య, తూర్పు కొండారెడ్డిపల్లి, వరికుంటపాడు

గతం స్వర్ణయుగం.. నేడు తిరోగమనం

ఇది పొగాకు రైతుల దుస్థితి

వైఎస్సార్‌సీపీ హయాంలో క్వింటా	కూటమి పాలనలో క్వింటా
రూ. 37,000	రూ. 28,000

కందుకూరు: జిల్లాలో కందుకూరు, కలిగిరి, డీసీపల్లి ప్రాంతాల్లో వర్జీనియా పొగాకు పంటను రైతులు విస్తృతంగా సాగు చేస్తున్నారు. వేల మంది పొగాకు పంట సాగుపై ఆధారపడి జీవిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో పొగాకు రైతులకు స్వర్ణయుగంలా సాగింది. పొగాకు ధరలు పతనమైన సమయంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి నేరుగా వేలం ప్రక్రియలో పొగాకు ఉత్పత్తులను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంది. దీంతో పొగాకు వ్యాపారుల మధ్య పోటీ పెరిగి ధరలు పెంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతులు లాభాల బాట పట్టారు. ఐదేళ్లు కాసులు కురిపించింది. ప్రధానంగా 2022–23, 2023–24 సీజన్‌లు అయితే రికార్డు ధరలు పొగాకు రైతులకు వచ్చాయి. గతేడాది కేజీ పొగాకు సరాసరి ధర రూ.270 వరకు పలికింది. ఇక బ్రైట్‌గ్రేడ్ పొగాకు అయితే ఏకంగా క్వింటా రూ.37,000 వరకు ధరలు వచ్చాయి. పొగాకు రైతులకు మరో మేలు చేసే చర్యలు కూడా గత ప్రభుత్వం తీసుకుంది. అప్పటి వరకు అధికంగా పండించిన పొగాకుపై 5 శాతం వరకు జరిమానా విధించి పొగాకు కొనుగోలు చేసేవారు. అయితే కేంద్ర ప్రభుత్వంతో చర్చించి అధిక పొగాకు ఉత్పత్తులపై ఉన్న జరిమానాలు పూర్తిగా రద్దు చేయించారు. దీంతో రైతులు ఎటువంటి జరిమానాలు లేకుండానే అధికంగా పండించిన పొగాకును వేలం కేంద్రాల్లో అమ్ముకునే అవకాశం లభించింది. దీని వల్ల ప్రతి రైతుకు అదనంగా రూ.40 వేల నుంచి రూ.60 వేల వరకు లబ్ధి చేకూరింది. పొగాకు చూర, ముక్క వంటివి కూడా వేలం కేంద్రాల్లోనే అమ్ముకునే వెసులుబాటు కల్పించారు. దీంతో రైతులకు అన్ని విధాలా లాభాలు చేకూర్చి ఆదాయాలు రెట్టింపయ్యాయి.

కుప్పకూలిన ధరలు

ప్రస్తుతం కూటమి ప్రభుత్వ పాలనలో పొగాకు రైతుల పరిస్థితి దయనీయంగా తయారైంది. 2024–25 సీజన్‌కు సంబంధించి పొగాకు అమ్మకాలు ప్రారంభమై దాదాపు రెండున్నర నెలలు కావస్తుంది. ప్రారంభ బ్రైట్ గ్రేడ్ పొగాకు ఇచ్చిన రూ.280లే నేటికి ఇస్తున్నారు. అదే గతేడాది బ్రైట్ గ్రేడ్ కేజీ పొగాకు రూ.365 పలికితే నేడు అదే పొగాకు రూ.280లకు కొనుగోలు చేస్తున్నారు. అంటే క్వింటా పొగాకు మీద ఒక రైతుకు రూ.8,500 వరకు నష్టపోతున్నారు. ప్రస్తుతం కేజీ పొగాకు సరాసరి ధర రూ.259లు మాత్రమే పలుకుతుంది. గతేడాదికీ ఇప్పటికీ దాదాపు రూ.15 వేల వరకు తేడా కనిపిస్తుంది. అయినా ప్రభుత్వంలో ఎటువంటి చలనం రావడం లేదు.

కోలుకోలేని నష్టాలు



ఈయన వలేటివారిపాళెం మండలం అయ్యవారిపల్లెకు చెందిన సాధారణ రైతు ఆవుల వెంకట్రావు. 15 ఎకరాలు పొలం కౌలు తీసుకుని పొగాకు సాగు చేశాడు. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది డిమాండ్ వల్ల పొలం కౌలు, కూలీల ఖర్చు, సాగు ఖర్చులు పెరగడంతో ఇప్పటి వరకు రూ.14.75 లక్షల వరకు ఖర్చు చేయాల్సి వచ్చింది. ప్రస్తుతం పొగాకు మార్కెట్ రేట్ల ప్రకారం వెంకట్రావు వద్ద ఉన్న పొగాకు అమ్మినా కూడా రూ.9 లక్షల వరకు వస్తుంది. ఆయన పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. ఈ ఏడాది సుమారుగా రూ.5.75 లక్షల వరకు వెంకట్రావు పెట్టుబడిని నష్టపోవాల్సిన పరిస్థితి తప్పడం లేదు.

వైఎస్సార్‌సీపీ నేతలు కేసులకు భయపడరు

- తారస్థాయికి చేరిన కూటమి దాష్టీకాలు, పోలీసుల అరాచకాలు
- కాకాణిపై పెట్టినవి తప్పుడు కేసులే.. న్యాయస్థానంలో నిలబడదు
- వైఎస్సార్‌సీపీ పీఏసీ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి



జిల్లా జైల్లో కాకాణిని పరామర్శించేందుకు వస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మేరిగ మురళి, కిలివేటి సంజీవయ్య, ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): కూటమి ప్రభుత్వం అబద్ధపు, బలవంతపు వాంగ్మూలాలతో పెట్టే కేసులకు వైఎస్సార్‌సీపీ అభిమాని కూడా భయపడడని, ఆ కోణంలోనే మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై పెట్టిన అక్రమ కేసు న్యాయస్థానంలో నిలబడదని వైఎస్సార్‌సీపీ పీఏసీ కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. నెల్లూరు సెంట్రల్ జైల్లో ఉన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డిని శనివారం ములాఖత్‌లో కలిసి పరామర్శించిన అనంతరం ఎమ్మెల్సీ, నెల్లూరుసిటీ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళి, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి తదితర నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీ నేతలపై ఎప్పుడో ఉన్న చిన్న చిన్న కేసులను సైతం వెలికితీసి రాద్ధాంతం సృష్టించడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. రోజురోజుకు మరింత బలపడుతుందన్నారు. ఇంత సులువుగా తప్పుడు కేసులు పెట్ట వచ్చని కూటమి ప్రభుత్వం నిరూపించిందని, ఇదే పరిస్థితి రేపు ఆ పార్టీ నేతలకు కూడా వర్తిస్తుందని హెచ్చరించారు. అధికారంలో ఉండి చేస్తున్న అరాచకాలకు ప్రజలే రోడ్లపైకి వచ్చి నిలదీసే రోజు వస్తుందన్నారు. అక్రమాలను ప్రశ్నించిన కాకాణిపై అక్రమ కేసు బనాయించి అరెస్ట్ చేశారని, ప్రతిపక్ష నాయకులను అరెస్ట్ చేస్తే ఆ పార్టీ బలహీన పడుతుందని అనుకోవడం పొరపాటేనన్నారు. ఏడాది పాలనలో అధికార పార్టీ నాయకులే ప్రజల ముందుకు రావడానికి వెనుకాడుతున్నారన్నారు.

ధైర్యంగా ఉండండి..

కాకాణి కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని కాకాణి కుటుంబానికి సజ్జల రామకృష్ణారెడ్డి భరోసా ఇచ్చారు. నగరంలోని డైకాస్‌రోడ్డులో ఉన్న కాకాణి నివాసానికి శనివారం వెళ్లి కుమార్తె కాకాణి పూజితను పరామర్శించారు. సజ్జల మాట్లాడుతూ కాకాణిపై అక్రమ కేసులు బనాయించారని, న్యాయస్థానాల్లో క్లీన్‌చిట్ లభిస్తుందన్నారు. ప్రభుత్వ అక్రమాలు, ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరినందుకే కూటమి ప్రభుత్వం కాకాణిపై అక్రమ కేసును బనాయించిందన్నారు. నిర్దోషిగా కాకాణి బయటకు వస్తారన్నారు.

మైనింగ్ అక్రమ కేసుపై సీబీఐతో విచారించండి

- రాష్ట్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలపై నమ్మకం లేదు
- కాకాణి పూజిత, నాయకుల డిమాండ్
- ఇన్‌చార్జి కలెక్టర్‌కు వినతి పత్రం



కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు




ఇన్‌చార్జి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పూజిత, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్‌పర్సన్, మాజీ ఎమ్మెల్యే, ఇన్‌చార్జిలు

నెల్లూరు(అర్బన్): మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై పెట్టిన అక్రమ కేసులు, అరెస్ట్‌కు సంబంధించి సీబీఐ దర్యాప్తు చేయించాలని కాకాణి పూజిత, జెడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి, మేరిగ మురళి, నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. కాకాణి పూజిత మాట్లాడుతూ జిల్లా ప్రజలకు కాకాణిపై ఒక గౌరవం, నమ్మకం ఉందని ఆయనపై పెట్టిన కేసులకు సంబంధించి సీబీఐతో దర్యాప్తు చేయించి వాస్తవాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. విచారణలో అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. ప్రశ్నించే గొంతుకు సంకెళ్లు వేస్తున్నారని, ప్రజలు ఈ కేసులో నిజం లేదని నమ్ము తున్నారన్నారు. మా వైపు న్యాయం ఉంది. నిజం బయటకు రావాలి. రాష్ట్ర ప్రభుత్వ సంస్థల దర్యాప్తుపై నమ్మకం లేదని, సీబీఐ విచారణను ధైర్యంగా కోరుతున్నామన్నారు. ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ అక్రమాలను తమ నాయకుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రశ్నించడమే నేరమయిందని తెలిపారు. సంవత్సరం క్రితం మైనింగ్‌లో అక్రమాలు జరిగాయని ఎవరో చెప్పారంట. అందుకే అరెస్ట్ చేశారనడం తగదన్నారు. ఇలాంటి విష సంస్కృతి నెల్లూరు జిల్లాలో ఇప్పటి వరకు లేదన్నారు. ఎమ్మెల్సీ మేరిగ మురళి మాట్లాడుతూ కక్ష పూరితంగా కాకాణిపై కేసు పెట్టారన్నారు. కాకాణి కుటుంబానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు అండగా ఉన్నారని గుర్తుంచుకోవాలన్నారు. సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో పాలన లేదని, రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీలను కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎంతో గౌరవిస్తారన్నారు. తాము ఆయన ఇంటికి వెళ్తే వారి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేస్తామన్నారు. అలాంటి మంచి వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టడం తగదన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ కాకాణిపై అక్రమ కేసులో ఏ1 నుంచి ఏ3 వరకు బెయిల్ ఇచ్చి ఏ4కి బెయిల్ ఇవ్వకుండా చేయడం ఎంతవరకు సబబన్నారు. టీడీపీ నాయకులే ఎవరిని ఎక్కడ అరెస్ట్ చేయాలో చెబుతారన్నారు. తప్పు చేయలేదు కాబట్టే తమ నాయకుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె ధైర్యంగా సీబీఐ విచారణ కోరిందన్నారు.

క్లుప్తంగా

ఏఆర్ కానిస్టేబుల్ అనుమానాస్పద మృతి

• పెన్నానదిలో మృతదేహం లభ్యం



రమేష్‌బాబు (ఫైల్)

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ మండలం పొట్టేపాళెం వద్ద పెన్నా నదిలో ఏఆర్ కానిస్టేబుల్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. ఈ ఘటన శనివారం సాయంత్రం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఇందుకూరుపేట మండలం పల్లిపాడు గ్రామానికి చెందిన కె రమేష్‌బాబు 2012 బ్యాచ్ ఏఆర్ స్పెషల్ పార్టీ కానిస్టేబుల్. 2016లో రేపల్లికు చెందిన వాణీతో వివాహం అయింది. దంపతులకు 8 ఏళ్ల కుమారుడు ఉన్నాడు. ఈ క్రమంలో కొంతకాలంగా భార్యాభర్తల మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. దీంతో వాణి రేపల్లిలోని తల్లి ఇంట్లో ఉంటోంది. మే 28 సాయంత్రం నుంచి రమేష్‌బాబు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పలు ప్రాంతాల్లో వెతికారు. అయినప్పటికీ అతని ఆచూకీ లభించలేదు. శనివారం సాయంత్రం పొట్టేపాళెం గ్రామంలోని పెన్నానదిలో రమేష్‌బాబు మృతదేహం తేలియాడుతూ కనిపించింది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. రమేష్‌బాబు దుస్తులు, వాచ్ ఇతర వస్తువులు పెన్నానది ఒడ్డున ఉండడాన్ని గుర్తించారు. అతను నదిలో ఈతకు వెళ్లి మునిగాడో... లేక ప్రమాదవశాత్తు పడి మృతిచెందాడో.. మరి ఇంకేమన్నా కారణాలు ఉన్నాయో తెలియలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదుపు తప్పుతున్న శాంతిభద్రతలు

కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేయడంలో పోలీసు యంత్రాంగం తలమునకలవుతుండటంతో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోంది. హత్యలు, హత్యాయత్నాలు, దొంగతనాలు నిత్యకృత్యంగా మారుతున్నాయి. అనధికార మద్యం, గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. యువత మత్తులో నేరాలకు పాల్పడుతున్నారు. రహదారులు నెత్తురోడుతున్నాయి.

• నెలరోజుల్లో ఐదు హత్యలు
• రూ.కోటి సొత్తు అపహరణ
• 17 మందికి పైగా రోడ్డు ప్రమాదాల్లో మృతి
• నేర నియంత్రణకు పటిష్ట చర్యలేవీ?

నెల్లూరు(క్రైమ్): జిల్లా వ్యాప్తంగా ఐదు సబ్ డివిజన్లు, 12 సర్కిల్స్ పరిధిలో 52 పోలీసుస్టేషన్‌లు, 11 అర్బన్ పోలీసుస్టేషన్‌లు ఉన్నాయి. వీటి పరిధిలో నెలరోజుల వ్యవధిలో నేరస్తులు సుమారు రూ.కోటి విలువచేసే సొత్తును అపహరించుకుని వెళ్లారు. వింజమూరులో వెంకటేశ్వర్లు ఇంట్లో 28 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.13వేల నగదును అపహరించుకుని వెళ్లారు. జొన్నవాడలో సుప్రజ అనే మహిళ ఇంట్లో 20 సవర్ల బంగారు ఆభరణాలు, అరకేజీ వెండి వస్తువులు, రూ.లక్ష నగదును దోచుకెళ్లారు. కందుకూరుకు చెందిన రాజేశ్వరి ఇంట్లో 10 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.10వేల సొత్తును అపహరించారు. చేజర్లకు చెందిన ఖాదర్‌బాషా ఇంట్లో 15 సవర్ల బంగారు ఆభరణాలు అపహరించారు. ఇలా ఎన్నో జరుగుతున్నాయి. దేవుళ్లకు రక్షణ కొరవడింది. దేవాలయాలను చోరులు వదలడం లేదు. పాతనేరస్తులు మద్యం తాగేందుకు నగదు కోసం కత్తులతో చంపుతామని బెదిరించి మరీ ప్రజలనుంచి నగదు దోచుకెళుతున్నారు.



రాపూరులో హత్యకు గురైన షఫీ(ఫైల్)

చిన్నపాటి కారణాలతోనూ హత్యలు

పాతకక్షలు, ఆర్థిక లావాదేవీలు, చిన్నపాటి కారణాలతోనూ హత్యలు జరుగుతున్నాయి. సుపారీ సంస్కృతి పెరుగుతోంది. బుజబుజనెల్లూరులో పిల్లలను ఎందుకు బెదిరిస్తున్నావని ప్రశ్నించిన మాబున్నీసాను అదే ప్రాంతానికి చెందిన విజయ్ హత్యచేశారు. ఆర్థిక లావాదేవీల విషయంలో అయ్యప్పగుడి సమీపంలో రియల్టర్ చిన్నయ్యను స్నేహితుడు వెంకటేశ్వర్లు అతి దారుణంగా హత్యచేశారు. వెంకటాచలం చవటపాళెం పంచాయతీ అబ్బిసాహెబ్ కండ్రిగలో అనుమానంతో భార్య భారతిని గొంతుకోసి హత్యచేసిన భర్త బాబు. బుచ్చిరెడ్డిపాళెం మండలంలో మల్లికార్జునరెడ్డి, రాపూరులో షఫీ దారుణ హత్యకు గురయ్యారు. వరుస హత్యలు జిల్లా వాసులను కలవరపాటుకు గురిచేస్తూనే ఉన్నాయి. ఇక హత్యాయత్నాలు పదుల సంఖ్యలో చోటుచేసుకున్నాయి. మరోవైపు కుటుంబ కలహాలు, మద్యానికి బానిసై ఆరోగ్యం క్షీణించి ఇలా కారణం ఏదైతే నేమి 15మందికి పైగా ఆత్మహత్యలు చేసుకున్నారు. ఆత్మహత్యా యత్నాలకు పాల్పడి పలువురు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

పలు కేసులు

మహిళలు, చిన్నారులపై లైంగిక వేధింపులు జరుగుతున్నాయి. వెంకటాచలం మండల పరిధిలో ఒంటరిగా నివసిస్తున్న మహిళపై చత్తీస్‌ఘడ్‌కు చెందిన ఆదం లైంగికదాడికి యత్నించారు. ఆమంచర్ల గ్రామంలో కామంతో కళ్లుమూసుకుపోయిన వృద్ధుడు ఏడుకొండలు తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికపై ఏడాదిగా లైంగిక దాడిచేశారు. ఆమెకు అబార్షన్ సైతం చేయించాడు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మహిళలు, చిన్నారుల అదృశ్యం కేసులు అధికమయ్యాయి. మెరుగైన శాంతిభద్రతలు అందించడంలో కూటమి సర్కార్ ఘోరంగా విఫలమైందన్న విమర్శలు మూటగట్టుకుంది. ఇప్పటికైనా అధికారులు నేరం జరిగిన తర్వాత హడావుడి చేయడం కంటే నేరాలను ముందస్తుగా కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా వాసులు కోరుతున్నారు.

రక్తమోడుతున్న రహదారులు

రహదారి ప్రమాదాల నివారణకు అధికారులు తీసుకుంటున్న చర్యలు కాగితాలకే పరిమితమయ్యాయన్న విమర్శలున్నాయి. దీంతో జిల్లాలో నిత్యం రహదారులు రక్తమోడుతున్నాయి. మితిమీరిన వేగం, మద్యం మత్తులో వాహన డ్రైవింగ్, ఓవర్ టేకింగ్, నిద్రమత్తు ఇలా కారణం ఏదైతేనేం నెలరోజుల వ్యవధిలో సుమారు 17మంది రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందారు. క్షతగాత్రులు 50 మందికి పైగా ఉన్నారు. రహదారి ప్రమాదాల నియంత్రణలో సంబంధిత అధికారులు విఫలమయ్యారన్న అపవాదును మూటగట్టుకున్నారు.



అల్లూరులో రఫీ ఇంట్లో దొంగతనం (ఫైల్)

బావిలో పడి వ్యక్తి మృతి



మృతిచెందిన మహబూబ్ బాషా

సీతారామపురం: స్థానిక గుంటమడుగు వాగు సమీపాన గల ఎర్రగుంట్ల బావిలో శనివారం చేపలు పట్టేందుకు వెళ్లి రాజుగారి కాలనీ ప్రాంతంలోని మంగలి వీధికి చెందిన షేక్ మహబూబ్ బాషా(70) అనే వ్యక్తి మృతిచెందాడు. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్ బాషా దర్గాల వద్ద ముజావర్‌గా ఉంటూ, గ్రామంలో పాత ఇనుముకి ఎర్రగడ్డలు, చక్కెర మిఠాయిలు ఇచ్చే వ్యాపారం చేస్తూ అందరితో కలివిడిగా ఉండేవాడు. ఖాళీ సమయంలో చేపలు పట్టే అలవాటు ఉండడంతో శనివారం ఉదయం గాలం తీసుకుని ఇంటి నుంచి బయలుదేరి ఎర్రగుంట్ల బావి వద్దకు చేరుకున్నాడు. చేపలు పట్టే సమయంలో ప్రమాదవశాత్తు బావిలో జారిపడి మృతి చెందాడు. సాయంత్రం సమయంలో బావిలో ఈత కొట్టేందుకు వెళ్లిన యువకులు నీళ్లపై తేలియాడుతున్న మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారంతా బావి వద్దకు చేరుకుని కన్నీటి పర్యంతమయ్యారు.

రెండు బైకులు ఢీకొని ఇద్దరికి గాయాలు

పొదలకూరు: పట్టణానికి సమీపంలోని నెల్లూరు మార్గం కేఆర్ఆర్ నగర్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎదురెదురుగా రెండు మోటారు బైకులు ఢీకొని ఇద్దరు యువకులు గాయపడ్డారు. స్థానికులు, పోలీసుల సమాచారం మేరకు రాజంపేటకు చెందిన నాగేంద్ర మోటారు బైక్‌పై తేనె అమ్ముకుంటుంటారు. ఈ క్రమంలో నెల్లూరు మార్గంలో బైక్‌పై వెళుతూ రోడ్డు దాటుతుండగా పొదలకూరు వైపు వస్తున్న మరో మోటారు బైక్ వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగేంద్రతో పాటు ఢీకొన్న బైక్ నడుపుతున్న యువకుడు కూడా గాయపడ్డాడు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏ కష్టమొచ్చిందో.. ఏమో..?

• కాలువలో శవమై తేలిన వివాహిత
• కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు

సంగం: పెరమన గ్రామానికి చెందిన ఓ వివాహిత సంగం మండలం ర్యాంపు వద్ద గల కనిగిరి రిజర్వాయర్ ప్రధాన కాలువలో శనివారం సాయంత్రం శవమై కనిపించింది. శుక్రవారం సాయంత్రం తన ఇద్దరు చిన్నారులకు అన్నం పెట్టి పక్కనే ఉన్న దుకాణానికి వెళ్లి వస్తానన్న కత్తి లావణ్య (28) రిజర్వాయర్ ప్రధాన కాలువలో శవమై కనిపించడంతో బంధువులు పొగిలి పొగిలి రోదించారు. ర్యాంపు వద్ద మహిళ మృతదేహం లభించిందన్న విషయం తెలుసుకున్న స్థానికులు ఆమె ఎవరో తెలియక.. యువతి చేతులకు గోరింటాకు, కాలికి మెట్లు, పారాణి కనిపించడంతో నవ వధువులా ఉందని, ఇంతలోనే ఏ కష్టమొచ్చిందో ఆత్మహత్య చేసుకుని ఉంటుందని భావించారు. ఆ తరువాత మృతురాలి వివరాలు తెలిశాయి. ఆ ప్రకారం.. సంగం మండలం పెరమన గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ జగదీష్‌కు 8 సంవత్సరాల క్రితం ఆత్మకూరు మండలం నువ్వూరుపాడుకు చెందిన కత్తి రమేష్, పెంచలమ్మల కుమార్తె లావణ్యను ఇచ్చి వివాహం చేశారు. వీరికి రెండో తరగతి చదువుతున్న బాబు, అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్తున్న పాప ఉన్నారు. వీరి కుటుంబంలో ఏం జరిగిందో ఏమో కానీ శుక్రవారం రాత్రి 7 గంటల తరువాత లావణ్య కనిపించలేదు. దీంతో భర్త జగదీష్, అతని తల్లిదండ్రులు పెరమన గ్రామమంతా వెతికి ఆమె తల్లిదండ్రులకు, బంధువులకు సమాచారం ఇచ్చారు. శనివారం ఉదయం సంగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం సాయంత్రం రిజర్వాయర్ ప్రధాన కాలువలో లావణ్య శవమై కనిపించింది. అంగడికి వెళ్లి వస్తానన్న అమ్మ రాకపోవడంతో అర్ధరాత్రి వరకు చిన్నారులు మారం చేస్తున్నారని జగదీష్ తల్లిదండ్రులు చెప్పిన మాటలు పెరమన గ్రామస్తులను కన్నీరు పెట్టించాయి. సంగం పోలీసులు లావణ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించారు. ఇన్‌చార్జి ఎస్సై సైదులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



లావణ్య మృతదేహం

డబ్బులడిగితే తల్లి మందలించిందని..

ఉదయగిరి: తల్లి మందలించడంతో మనస్తాపం చెంది ఫ్యానుకు ఉరి వేసుకుని ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఉదయగిరి పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. కాలనీకి చెందిన గాలేటి రమణయ్య, రత్తమ్మ దంపతుల కుమార్తె నవ్య (17). ఫ్రైడ్ రైస్ కోసం బంధువుల ఇంటి వద్ద ఉన్న తన తల్లి దగ్గరకు వెళ్లి రూ.50 నగదు అడిగింది. దీంతో తల్లి తన దగ్గర డబ్బులు లేవని రోజూ ఎలా వస్తాయని మందలించి రూ.20లు ఇచ్చింది. దీంతో ఆ బాలిక మనస్తాపానికి గురై ఇంటికి వెళ్లి గడియ పెట్టుకుని ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కొంత సేపటి తర్వాత ఇంటికొచ్చిన తల్లి తలుపు ఎంత కొట్టినా తీయక పోవడంతో చుట్టు పక్కలవారి సాయంతో గడియ తీసి చూసేసరికి ఉరి వేసుకుని నవ్య ఫ్యానుకు వేలాడుతూ కనిపించింది. వెంటనే స్థానికుల సాయంతో కిందకు దింపి చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించి కుటుంబ సభ్యులకు తెలిపారు. కుమార్తె మృతితో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. కాలనీలో విషాదఛాయలు అలముకున్నాయి. విషయం తెలుసుకున్న ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి మృతురాలి ఇంటిని పరిశీలించడంతో పాటు వైద్యశాలకు వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు.



నవ్య మృతదేహం

వివాహిత అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): వివాహిత అదృశ్యమైన ఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. నేపాల్‌కు చెందిన గగన్, భావన జైషీద్ దంపతులు. వారికి ఆరేళ్ల కిందట వివాహమైంది. ప్రస్తుతం వారు నగరంలోని తులసీ నర్సింగ్‌హోమ్‌లో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 24న భావన ఇంటి నుంచి వెళ్లింది. అప్పటి నుంచి ఆమె జాడ తెలియరాలేదు. ఈ మేరకు భర్త శనివారం చిన్నబజారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తప్పు జరిగింది, మన్నించండి

• నగ్న నృత్యాలపై గ్రామ కాపుల వివరణ

అల్లూరు: శంభునిపాలెం గ్రామంలో హనుమాన్ జయంతి రోజున జరిగిన నగ్న నృత్యాల వీడియో వైరల్ కావడంపై శనివారం ఆ గ్రామ కాపులు విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హనుమాన్ జయంతి రోజున సాంస్కృతిక కార్యక్రమాలు, హిజ్రాల డ్యాన్స్ కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేశామని, కానీ తాము ఉన్నంత సేపు కార్యక్రమం పద్ధతిగా నడిచిందని, వర్షం పడడంతో అక్కడ ఉండే వారు, కాపులు కూడా ఇళ్లకు వెళ్లిపోయారన్నారు. తదనంతరం అక్కడి కుర్రకారు అసాంఘిక నృత్యాలను వేయించారన్నారు. ఇందులో తమకు తెలియకుండానే తప్పు జరిగిపోయిందని, అందుకు తమను మన్నించి క్షమించాలని ఇకపై ఎప్పుడూ ఇలాంటి తప్పులు జరగకుండా చూసుకుంటామని కాపులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాపులు ఆంజనేయులు, వాసు, శ్రీనివాసులు, హజరత్తయ్య, సుధాకర్, గ్రామ పెద్దలు దేవరాజు, బాబు, సురేష్, వెంకట్రావు, వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటు దినం విజయవంతం చేద్దాం

• మాజీ మంత్రి ప్రసన్నకుమార్ రెడ్డి
• పోస్టర్ ఆవిష్కరణ

కోవూరు: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వారికి వెన్నుపోటు పొడిచిందని, ఇందుకు నిరసనగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జూన్ 4న నిర్వహించనున్న నిరసన ర్యాలీని కోవూరు నియోజకవర్గంలో విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ముందుకు రావాలని మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. కోవూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం వెన్నుపోటు దినం పోస్టర్ను నాయకులు, ప్రజాప్రతినిధులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజల సంక్షేమాన్ని ఏ మాత్రం పట్టించుకోని దుర్మార్గమైన పాలన చేస్తున్నారని పేర్కొన్నారు. జూన్ 4న ఉదయం 9 గంటలకు స్థానిక బజారు సెంటర్ నుండి ప్రారంభించి ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వరకు నిరసన ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల కన్వీనర్లు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ఇటీవల కోవూరులో తాను 2029లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ గద్దె నెక్కుతారని మాట్లాడానని, ప్రధాని నరేంద్రమోడి ఒప్పుకుంటే బీజేపీతో కలసి ముందుకు పోతామని నా వ్యక్తిగత అభిప్రాయాన్ని వెల్లడించానని తెలిపారు. అయితే కొన్ని ఛానెళ్లు దీనిని వక్రీకరించి ప్రసన్నకుమార్‌రెడ్డి జగన్‌కు ఝలక్ ఇచ్చాడని చెప్పాయని, నేను మాత్రం కడ వరకు జగన్‌తోనే కలిసి నడుస్తానని పేర్కొన్నారు. నాకు గతంలో మంత్రి పదవి ఇవ్వకపోయినా నేను మాట్లాడలేదని, కాకాణి గోవర్ధన్‌రెడ్డికి, అనిల్ కుమార్ యాదవ్‌కి ఇచ్చారని సంతోషించానన్నారు. మంత్రి పదవి కన్నా ఎక్కువగా జగన్‌మోహన్ రెడ్డి నాకు సహకారం అందించి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, నాయకులు వీరి చలపతి, పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, మండల కన్వీనర్లు అనూప్‌రెడ్డి, మావులూరు శ్రీనివాసులు రెడ్డి, శేషగిరిరావు, నవీన్‌కుమార్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, షాహుల్, దినేష్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, మీరారెడ్డి పాల్గొన్నారు.



పార్టీ నాయకులతో కలిసి పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

బ్యాంక్‌లోనే బ్యాగ్ కొట్టేద్దామని!

• చోరీకి యత్నించిన మహిళా దొంగ

సైదాపురం: ఓ బ్యాంక్‌కు వచ్చిన మహిళ బ్యాగ్‌ను మహిళా దొంగ కొట్టేసేందుకు యత్నించిన ఘటన స్థానికంగా సంచలనం కలిగించింది. మండలంలోని అనంతమడుగు గ్రామానికి చెందిన బండి శశికళ సైదాపురంలోని సిండికేట్ బ్యాంకులో బంగారు రుణం చెల్లించేందుకు శనివారం స్వగ్రామం నుంచి బ్యాంకుకు చేరింది. ఆమె ఓచర్ రాస్తున్న సమయంలో ఓ మహిళ అనుమానాస్పదంగా కనిపించింది. ఓచర్ రాసి బ్యాగును చూడగా.. బ్లేడుతో కోసిన ఆనవాళ్లు కనిపించాయి. దీంతో అక్కడే ఉన్న ఆ మహిళను ప్రశ్నించగా బ్యాంకులో నుంచి ఉడాయించింది. స్థానికులు ఆ మహిళను వెంబడించి పట్టుకుని పోలీసులకు అప్పగించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు.

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.40
నన్నవి	: రూ.20
పండ్లు	: రూ.10

